క్లుప్తంగా

నేడు అయ్యప్పకు ప్రత్యేక పూజలు

చినారికట్ల (కొనకనమిట్ల): అయ్యప్పస్వామి పుట్టిన రోజు సందర్భంగా మండలంలోని చినారికట్ల అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్పస్వామికి మంగళవారం అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తారని ఆలయ కమిటీ నిర్వాహకుడు, ఎంపీపీ మోరబోయిన మురళీ కృష్ణ యాదవ్ తెలిపారు. ఆలయంలో పూజా కార్యక్రమాలను వైఎస్సార్ సీపీ నాయకులు ఉడుముల గురవారెడ్డి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. పూజలనంతరం గ్రామంలో అయ్యప్ప స్వామి నగరోత్సవం, ఒంగోలు వారిచే భజన కార్యక్రమంతో పాటు రాత్రికి అన్నదానం ఉంటుందని పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పెద్దదోర్నాల: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను జోనల్ అధికారి యోగానందప్రసాద్, తహసీల్దార్ వేణుగోపాలరావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు పకడ్బందీగా నిర్వహిస్తామని తెలిపారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో సర్వేయర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హోలీ సంబరాలు



ఆంటోనీస్ పాఠశాల చిన్నారుల కేరింతలు

దొనకొండ: మండలంలో హోలీ సంబరాలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులు, పెద్దలు కుల, మతాలకు అతీతంగా చిన్నా, పెద్ద తేడా లేకుండా ఆనందోత్సాహలతో మునిగిపోయారు. రక రకాల రంగులు చల్లుకుంటూ హోలీ సంబరాలు జరుపుకున్నారు. ఒకరికొకరు హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. స్థానిక సెయింట్ ఆంటోనీస్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ పవిత్ర ఆధ్వర్యంలో హోలీ పండగను విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు.

తాగునీటి సమస్యపై దృష్టి సారించండి

పెద్దారవీడు: వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బంది రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు కోరారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బెజవాడ పెద్దగురవయ్య అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో సమస్యలను చెప్పుకుందామంటే సమావేశానికి కొన్ని శాఖల అధికారులు రావడంలేదని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 11 గంటలకు నిర్వహించాల్సిన సమావేశాన్ని 12 గంటలు దాటిన తర్వాత అధికారులు తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారని సర్పంచ్ పొందుగుల వెంకటరెడ్డి అన్నారు. సమావేశానికి హాజరు కాని మండల అధికారులకు నోటీసులు జారీ చేస్తామని ఎంపీడీఓ రాజ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఏర్వ చలమారెడ్డి, వైస్ ఎంపీపీలు గుండారెడ్డి యోగమ్మ, పోటు కుమారి, డీటీ రాజేష్, సర్పంచులు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఏడు రోజుల జైలు

ముండ్లమూరు: మండలంలోని బసవాపురం గ్రామానికి చెందిన కనపర్తి వెంకటేశ్వర్లు పోలీసులకు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. దర్శి కోర్టులో ఆయన్ను హాజరుపరచగా జడ్జి ఏడు రోజులు జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ సంపత్ కుమార్ తెలిపారు.

భక్తులతో పులకించిన మునగపాడు



బోనాలతో మహిళలు



ప్రభపై మాట్లాడుతున్న ఉడుముల



ధగధగలాడుతున్న విద్యుత్ ప్రభ

- వైభవంగా చౌడేశ్వరీదేవి ఉత్సవాలు
- ఆకట్టుకున్న వైఎస్సార్ సీపీ విద్యుత్ ప్రభలు

కొనకనమిట్ల: మండలంలోని మునగపాడు చౌడేశ్వరీదేవి తిరునాళ్ల భక్తులతో పులకించింది. చౌడమ్మతల్లి దీవించమ్మా..అంటూ భక్తులు జయజయ ధ్వానాలతో తిరునాళ్ల మార్మోగింది. బారులుతీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని పునీతులయ్యారు. మంగళవారం వేకువ జామున జరిగిన అమ్మవారి జ్యోతి ఉత్సవంలో భక్తులు పరవశించి పోయారు. పరిసర గ్రామాల ప్రజలతో పాటు విజయవాడ, గుంటూరు, వినుకొండ, మార్కాపురం ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు బోనాలతో వెళ్లి పసుపు కుంకుమలతో పూజించి నైవేద్యం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. నాగేటి చాళ్లల్లో ఉద్భవించిన చౌడేశ్వరి అమ్మవారిని కొలిస్తే అంతా సుభిక్షంగా ఉంటుందని భక్తులు విశ్వసిస్తారు. ఆ విశ్వాసంతోనే మునగపాడు, సమీప గ్రామాలకు సంబంధించి కుటుంబాలు ఎక్కడ స్థిర నివాసం ఉన్నా ఉత్సవాల రోజు వచ్చి మొక్కులు తీర్చుకోవటం ఆనవాయితీ. తిరునాళ్ల సందర్భంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఆకట్టుకున్న విద్యుత్ ప్రభలు

మునగపాడు చౌడేశ్వరి అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా మునగపాడు, వెలిగండ్ల గ్రామాల వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండు విద్యుత్ ప్రభలు ఆకట్టుకున్నాయి. ప్రభలపై ఏర్పాటు చేసిన పాట కచ్చేరీలు అలరించాయి. 40 ఏళ్లకుపైగా గ్రామంలో అత్యంత భక్తిశ్రద్ధలతో తిరునాళ్లు జరుపుతూ వివిధ సామాజిక వర్గాల వారు విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేశారు. తిరునాళ్ల సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన పలు రకాల షాపుల వద్ద సందడి నెలకొంది. ఉత్సవాల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పొదిలి సీఐ సుధాకర్, ఎస్ఐ దీపిక ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

జగనన్న పాలనలో అభివృద్ధి పరుగులు

జగనన్న పాలన సంక్షేమ పథకాలతో అభివృద్ధి పరుగులు పెడుతూ రోజూ పండగలాగే ఉంటోందని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని మునగపాడు శ్రీచౌడేశ్వరి అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా సోమవారం రాత్రి మునగపాడు, వెలిగండ్ల గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభలపై ఆయన పాల్గొని మాట్లాడారు.

లక్ష్యంతో చదివితే ఉన్నత భవిష్యత్

- విద్యాశాఖ ఆర్జేడీ సుబ్బారావు



కేజీబీవీ పాఠశాలలో మాట్లాడుతున్న ఆర్జేడీ సుబ్బారావు

పుల్లలచెరువు: విద్యార్థులు లక్ష్యం నిర్దేశించుకుని చదివితే ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని విద్యాశాఖ గుంటూరు ఆర్జేడీ సుబ్బారావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కేజీబీవీలో టెన్త్, ఇంటర్మీడియెట్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ప్రిన్సిపాల్ లిల్లీప్రకాశ్‌వాణి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్జేడీ మాట్లాడుతూ.. నేర్చుకున్న పాఠాలను ఏకాగ్రతతో చదువుతూ పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. డీఈఓ రమేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను సద్వినియోగం చేసుకుని బాగా చదువుకోవాలని చెప్పారు. డీడీఓ సాయికుమార్ మాట్లాడుతూ.. బాలికలు బాగా చదువుకుని అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం కెజీబీవీ పాఠశాలలకు రూ.లక్ష విలువ చేసే కంప్యూటర్, ప్రింటర్, స్కానర్, 15 మంది దేశ నాయకుల ఫొటోలు, మైక్‌ను దాతలు పొట్లపల్లి బాలకృష్ణ, సోము కోటిరెడ్డి, గాజులపల్లి ఉమామహేశ్వరావు, యు.సుబ్బారావు, కత్రి గణేష్ ఆర్జేడీ చేతుల మీదుగా పాఠశాలకు అందజేశారు. టెన్త్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థికి రూ.పది వేలు అందజేస్తానని ఆర్జేడీ ప్రకటించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో తహసీల్దార్ దాసు, ఎంఈఓ శామ్యూల్‌జాన్, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జానీబాషా, మాజీ సైనికుడు డి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాన్ని పెంపొందించాలి

పుల్లలచెరువులోని బీసీ కాలనీ పాఠశాల, జెడ్పీ స్కూల్‌ను ఆర్జేడీ తనిఖీ చేశారు. విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంపొందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. రోజూ వర్క్‌బుక్స్ తనిఖీ చేయాలని, విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని చెప్పారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్ ఉపయోగించి పాఠాలు బోధించాలని స్పష్టం చేశారు.

ప్రతిపక్షాల కుట్రలు తిప్పికొట్టాలి

- ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు



కంభంలో గృహసారథులకు కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు

కంభం: ప్రతిపక్షపార్టీల కుట్రలను తిప్పి కొడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు సూచించారు. స్థానిక అన్నపూర్ణ కల్యాణ మండపంలో మంగళవారం అర్ధవీడు, కంభం మండలాల కన్వీనర్లు, గృహసారథులు, ప్రజాప్రతినిధులతో ఆయన వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమానికి గిద్దలూరు నియోజకవర్గ పరిశీలకుడు బంగారు శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అవినీతి అక్రమాలకు ఏ మాత్రం తావు లేకుండా డీబీటీ ద్వారా నేరుగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. రాష్ట్రంలో 34 లక్షల మందికి ఇంటి స్థలాలు ఇవ్వడంతో పాటు గృహాలు మంజూరు, నూతన గ్రామాలు నిర్మించే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లు సమన్వయంతో పని చేసి పార్టీ పటిష్టతకు కృషి చేయాలలన్నారు. ఈ నెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యం ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ నెల 18 నుంచి జరగనున్న మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని విజయవంతం చేయాలన్నారు. విశాఖపట్టణంలో జరిగిన గ్లోబల్ సమ్మిట్‌లో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నందుకు హర్షిస్తూ భారీ కేక్ కట్ చేశారు. అనంతరం సచివాలయాల వారీగా గృహ సారథులకు కిట్లు పంపిణీ చేశారు. ఎంపీపీలు చేగిరెడ్డి తులశమ్మ, వెంకట్రావు, జెడ్పీటీసీలు కొత్తపల్లి జ్యోతి, చెన్ను విజయ, సర్పంచ్‌లు పల్నాటి బోడయ్య, బత్తుల తిరుపాలమ్మ (రజని), మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్‌లు యేలం వెంకటేశ్వర్లు, నెమలిదిన్నె చెన్నారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సయ్యద్ జాకీర్ హుస్సేన్, మాజీ ఎంపీపీ రవి కుమార్, చేగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీఎ నాగార్జునరెడ్డి



గిద్దలూరులో ప్రచారం చేస్తున్న నాయకులు



ఇంటింటా ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

పొదిలి రూరల్: వైఎస్సార్ సీపీ బలపరచిన తూర్పు రాయలసీమ ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు పని చేయాలని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పొదిలి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికలపై సచివాలయల కన్వీనర్లు, వార్డు కమిటీ అధ్యక్షులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, ముఖ్య నాయకులతో వార్డుల వారీగా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని ఎంపిక చేసి పోటీలో నిలిపారన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, కసిరెడ్డి రమణారెడ్డి, మండల, పట్టణ పార్టీ కన్వీనర్లు దుగ్గెంపూడి కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎస్‌కే నూర్జహాన్‌బేగం, జిల్లా కార్యదర్శి గొలమారి చెన్నారెడ్డి, కల్లం సుబ్బారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ గుజ్జుల రమణారెడ్డి, మాజీ కన్వీనర్ జి.శ్రీనివాసులు, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ జూపల్లి ఏడుకొండలు, పేరం సుభాష్ చంద్రబోస్‌రెడ్డి, గూడూరి వినోద్, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మల్లాపురం నరసింహులు, ఫిరోజ్, ముల్లా జాకీర్, కంకణాల రమేష్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరచిన ఎమ్మెల్సీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ మంగళవారం 12వ వార్డు కౌన్సిలర్ పెద్దవలి ఆధ్వర్యంలో పట్టణంలో అమ్మవారిశాల వీధి, చాకలి వీధి, కొప్పువారి వీధుల్లో ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తూర్పురాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ఓటర్ల ఇంటి వద్దకు వెళ్లి ప్రచారం కొనసాగించారు. ఖాజావలి, జనార్దన్, లతీఫ్‌ఖాన్, బాషా పాల్గొన్నారు.

కొనకనమిట్ల: తూర్పు, రాయలసీమ నుంచి పట్టభద్రుల స్థానానికి వైఎస్సార్ సీపీ తరపున పోటీ చేస్తున్న పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి మద్దతు ఇచ్చి మొదటి ప్రాధాన్యం ఓటు వేసి గెలిపించాలని కోరుతూ వైఎస్సార్ సీపీ మండల నాయకులు మంగళవారం పట్టభద్రులను కలిసి ప్రచారం చేశారు. ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, నాయకులు ఉడుముల గురవారెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ సూరవరపు పెదవెంకటరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని రేగడపల్లి, వాగుమడుగు గ్రామాల్లో ఓట్లు అభ్యర్థించారు.

బేస్తవారిపేట: వైఎస్సార్ సీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలను ఆశీర్వదించాలని వైస్ ఎంపీపీ డి.ఖాజామీయా, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ కొండా రఘునాథరెడ్డి కోరారు. మంగళవారం బేస్తవారిపేట అంబేడ్కర్ కాలనీ, ఎస్టీ కాలనీ, గాంధీబజార్‌లో ప్రచారం చేశారు. ఎంపీటీసీ గుంటి స్వప్న, సర్పంచ్ తండ్రి ప్రేమానంద్, ఉప సర్పంచ్ రమేష్ పాల్గొన్నారు.

తాళ్లూరు: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గ్రాడ్యుయేట్ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలకు మొదటి ప్రాధాన్యం ఓటు వేసి గెలిపించాలని మండల సచివాలయ జేసీఎస్ కన్వీనర్ యాడిక శ్రీనివాసరెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని బొద్దికూరపాడు, వెలుగువారిపాలెం, గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి గ్రామంలో గ్రాడ్యుయేట్ ఓటర్లకు పాంప్లేట్స్ అందించారు. సొసైటీ మాజీ అధ్యక్షుడు పులి ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ పాల కోటయ్య, హౌసింగ్ వేర్ రాష్ట్ర డైరెక్టర్ ప్రసాద్‌రెడ్డి, వెలుగవారపాలెం సర్పంచ్ కోటేశ్వరమ్మ, బ్రహ్మారెడ్డి, ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

కొమరోలు : ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. మండలంలోని ప్రజాప్రతినిధులు గ్రామాల్లో పర్యటిస్తూ తమ ఓటును వైఎస్సార్ సీపీ మద్దతుదారుడు, పట్టభద్రుల అభ్యర్థి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలంటూ ఓటర్లకు విజ్ఞప్తి చేస్తున్నారు. మండలంలోని రెడ్డిచెర్ల, పోసుపల్లె, మూలపల్లె గ్రామాల్లో ఎంపీపీ కామూరి అమూల్య ఇంటింటికీ తిరుగుతూ ఓటు వేసి గెలిపించాలంటూ ప్రచారం చేశారు. అల్లినగరం పంచాయతీలో జెడ్పీటీసీ సారె వెంకటనాయుడు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం చేశారు. సర్పంచ్ ఉమాదేవి, రత్నాలు, ఎంపీటీసీలు శ్రీనివాసరెడ్డి, నిర్మల, రామలక్ష్మి, వెంకట రమణ, మోహన్‌రెడ్డి, శేషు, రమణయ్య, శ్రీనివాసరాజు, విశ్వరూపం, సుభానీ, వెంగయ్యచౌదరి, మాలకొండయ్య పాల్గొన్నారు.

కురిచేడు: ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు ఓట్లేసి విజయం చేకూర్చాలని జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి కోరారు. మండలంలో ఆయన పార్టీ నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో కలిసి మంగళవారం ప్రచారం ప్రారంభించారు. పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖరరెడ్డిలకు మొదటి ప్రాధాన్యం ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ప్రచారం ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బొమ్మనబోయిన వెంకయ్య, కురిచేడు సొసైటీ మాజీ అధ్యక్షుడు గోగులముడి లింగారెడ్డి, సొసైటీ డైరెక్టర్ పత్తి సుబ్బయ్య, సచివాలయం కన్వీనర్లు ముప్పా శ్రీనివాసులు, దాసరి రమేష్, ఎన్వీ నాగిరెడ్డి, ముసికర యోగిరెడ్డి, షేక్ మౌలాలీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్, ప్రచార కమిటీ అధ్యక్షుడు కోలా సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

తర్లుపాడు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డికి మద్దతుగా ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సూచన మేరకు మంగళవారం మండలంలోని తాడివారిపల్లి, నాగేళ్లముడుపు, చెన్నారెడ్డిపల్లి, మీర్జాపేట గ్రామాల్లో ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో గ్రాడ్యుయేట్లను కలసి ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డికి తమ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. పార్టీ అధ్యక్షుడు మురారి, సర్పంచ్‌లు జాన్‌రత్నం, రామిరెడ్డి, కాశయ్య, తిరుమల బాలసుబ్బమ్మ, ఎంపీటీసీ పార్వతి రమేష్‌రెడ్డి, సొసైటీ ప్రెసిడెంట్ సత్యనారాయణరెడ్డి, రామాంజనేయరెడ్డి పాల్గొన్నారు.

పొదిలి రూరల్: పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ఉన్న వైఎస్సార్ సీపీ అభ్యర్థులు పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలకు మొదటి ప్రాధాన్యం ఓటు చేసి అత్యధిక మెజారీతో గెలిపించాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కసిరెడ్డి రమణరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి మండల సచివాలయాల కన్వీనర్ పేరం సుభాష్ చంద్రబోస్‌రెడ్డి కోరారు. మంగళవారం రాత్రి పొదిలి మండలంలోని సూదనగుంట సచివాలయం పరిధిలోని రామాపురం, తుమ్మగుంట, సూదనగుంటలో ముమ్మరంగా ఇంటింటా ప్రచారం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలపై కరపత్రాలు పంపిణీ చేశారు.

వైభవంగా కనకదుర్గమ్మ తిరునాళ్ల



కనకదుర్గమ్మ గుడిలో పూజలు చేస్తున్న భక్తులు

దొనకొండ: దొనకొండలోని కనకదుర్గమ్మ తిరునాళ్ల మంగళవారం భక్తులు వైభవంగా నిర్వహించారు. వినుకొండ, నరసరావుపేట, గుంటూరు, విజయవాడ ఇతర గ్రామాల నుంచి భక్తులు విచ్చేసి పొంగళ్లు పెట్టుకుని మొక్కులు తీర్చుకున్నారు. మొక్కుబడి ఉన్న భక్తులు హోమాలు చేశారు. ఆనవాయితీగా ఏటా పౌర్ణమి సందర్భంగా తిరునాళ్లు జరుపుకుంటారు. ఉదయం నుంచి మహిళలు తలంటు స్నానాలు చేసి కాయ, కర్పూరాలతో మొక్కులు తీర్చుకున్నారు. ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి దంపతులు అమ్మవారికి పూజలు చేసి ప్రసాదం స్వీకరించారు. వచ్చిన భక్తులకు కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందించి అన్నదానం చేశారు. రాత్రికి పౌరాణిక నాటకాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

రాష్ట్ర స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు ప్రారంభం



కొమరోలు: బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సారె వెంకట నాయుడు

కొమరోలు: మండలంలోని తిమ్మారెడ్డిపల్లె గ్రామ సమీపంలోని కొండపై వెలసిన మండలపాయ తిరుమలనాథస్వామి తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలను కొమరోలు జెడ్పీటీసీ సభ్యుడు సారె వెంకట నాయుడు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ వెంకటనాయుడు తిరుమలనాథస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బంగారు రత్నాలు, ఎంపీటీసీ వెంకట రమణ, సుభాని, దాసరి తిరుపతిరాజు, వైఎస్ఆర్ సీపీ నాయకులు బంగారు విశ్వరూపం, సుభాని, చాంద్‌బాషా, వెంగయ్యచౌదరి పాల్గొన్నారు.

నేడు గృహసారథులతో సమావేశం

గిద్దలూరు రూరల్: పట్టణంలోని విఠా సుబ్బరత్నం కల్యాణ మండపం ఆవరణలో రాచర్ల మండలం, గిద్దలూరు నగర పంచాయతీ పరిధిలోని సచివాలయం కన్వీనర్లు, గృహసారథులతో బుధవారం సమావేశం నిర్వహించనున్నట్లు మంగళవారం స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. రాచర్ల మండలం వారికి ఉదయం 10 గంటలకు, గిద్దలూరు నగర పంచాయతీ సచివాలయం కన్వీనర్లకు, గృహసారథులకు మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు సమావేశానికి హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

సంక్షిప్తంగా

వైఎస్సార్ సీపీ కార్యకర్తకు పరామర్శ



అశోక్‌ను పరామర్శిస్తున్న మద్దిశెట్టి రవీంద్ర

తాళ్లూరు: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన మాదవరానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త తాటికొండ అశోక్‌ను ఒంగోలు వైద్యశాలకు వెళ్లి పార్టీ నాయకులు మంగళవారం పరామర్శించారు. త్వరగ కోలుకోవాలని ఆకాంక్షించారు. పార్టీ నాయకులు మద్దిశెట్టి రవీంద్ర, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, దర్శి కౌన్సిలర్ వీసీ రెడ్డి, పార్టీ నాయకులు చిన్న ఆంజనేయరెడ్డి, జయరామిరెడ్డి, పెద్దిరెడ్డి ఉన్నారు.

నేడు 'విశాఖ' విజయోత్సవం

మార్కాపురం టౌన్: ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో 10.30 గంటలకు విశాఖ విజయోత్సవం నిర్వహిస్తున్నామని మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్ మంగళవారం తెలిపారు. విశాఖపట్నంలో జరిగిన సమ్మిట్‌లో 352 కంపెనీల ద్వారా రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి వచ్చేలా చేయడంతో పాటు ఆరు లక్షల ఉద్యోగాలు కూడా ఇస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందన్నారు. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తూ కేక్ కటింగ్ కార్యక్రమం ఉంటుందన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్‌లు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, ఇన్‌చార్జిలు, మార్కెట్ యార్డ్ ప్రతినిధులు, అనుబంధ సంస్థ అధ్యక్షులు, పార్టీ ముఖ్య నాయకులు హాజరు కావాలని కోరారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



బహుమతులు అందజేస్తున్న డీఎస్పీ, సీఐ, ఎస్ఐ

దర్శి: మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి సూచించారు. ఎస్పీ మలికాగర్గ్ ఆదేశాల మేరకు సంకల్పంపై అవగాహన కార్యక్రమం స్థానిక గౌతమి జూనియర్ కళాశాలలో కరస్పాండెంట్ కనుమర్ల గుండారెడ్డి అధ్యక్షతన మంగళవారం జరిగింది. విద్యార్థులకు కరపత్రాలు పంచి పెట్టారు. డ్రగ్స్‌పై క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి మాట్లాడుతూ తమ విలువైన సమయాన్ని మత్తు పదార్థాలకు బానిసై వృథా చేసుకోరాదని చెప్పారు. విద్యార్థి దశలో మంచి అలవాట్లతో క్రమశిక్షణగా ఉండాలని సూచించారు. ఈ దశలో మత్తు పదార్థాలకు బానిసలైతే జీవితాంతం బాధపడాల్సిందేనన్నారు. సీఐ రామకోటయ్య, ఎస్ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

చదువులో నిమగ్నమవ్వాలి

యర్రగొండపాలెం: విద్యార్థులు మనసుపెట్టి చదివినట్లయితే 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో టాపర్‌గా నిలుస్తారని ఎంఈఓ పి.ఆంజనేయులు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కొలుకుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ సభలో ఆయన మాట్లాడారు. టెన్త్‌లో మండల టాపర్‌గా నిలిచిన విద్యార్థికి రూ.5 వేలు నగదును మంత్రి ఆదిమూలపు సురేష్ చేతులమీదుగా అందజేస్తానని చెప్పారు. పాఠశాల అభివృద్ధికి విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు గ్రామస్తులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు బాలు నాయక్, దినేష్‌కుమార్, సర్పంచ్ రాజయ్య, మాజీ సర్పంచ్ అప్పారావు, ఎస్ఎంసీ చైర్మన్ ఆవుల రాజు, ఉపాధ్యాయులు నెహెమియా, ప్రభాకర్, రాములు నాయక్, అశోక్ పాల్గొన్నారు.

పీఎంజేజేబీవై బీమా నగదు అందజేత

బేస్తవారిపేట: బేస్తవారిపేటకు చెందిన బొల్లు నాగేశ్వరరావు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఖాతాదారుడు. ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజనలో సభ్యుడిగా ఉన్నాడు. ఈ మధ్య కాలంలో అనారోగ్యంతో నాగేశ్వరరావు మృతి చెందడంతో భార్య వరలక్ష్మికి బీమా నగదు రూ.2 లక్షలు ఎస్‌బీఐ మేనేజర్ ఎస్. వినీల్‌కుమార్ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన బీమా పథకాలను అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అసిస్టెంట్ బ్యాంక్ మేనేజర్ ఎం.శివప్రసాద్, సిబ్బంది శివనాయక్ పాల్గొన్నారు.



మృతుడి భార్యకు చెక్కు అందజేస్తున్న మేనేజర్